అతివలు ఎటు వైపు?

- ఓటింగ్‌పై లెక్కకు మించిన ఊహాగానాలు
- మహిళల ఓట్లు తమకేనంటూ పార్టీల అంచనాలు



ఓ పోలింగ్ బూత్‌లో బారులు తీరిన మహిళా ఓటర్లు(ఫైల్)

ఎంవీపీ కాలనీ: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గ మహిళల ఓటింగ్ విధానంపై లెక్కకు మించిన ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. తూర్పు నియోజకవర్గంలో 2,92,206 మంది ఓటు హక్కును కలిగి ఉన్నారు. అయితే ఈ ఎన్నికల్లో 2,00,563 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఈసారి 68.64 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో (2019) 64.73 శాతంతో పోలిస్తే 3.91 శాతం అధికంగా ఓటింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో 1,04,324 మంది మహిళ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపులో వారి పాత్ర కీలకమని స్పష్టమవుతోంది. నియోజకవర్గంలో మహిళా ఓటింగ్ ఏ పార్టీ అభ్యర్థికి ఎక్కువగా పడిందనే అంశంపై పెద్ద ఎత్తున నియోజకవర్గంలో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంతో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో ఓటర్లు సైలెంట్ ఓటింగ్‌కు ప్రాధాన్యమిచ్చారు. దీంతో ఎవరి నాడి ఏంటో తెలుసుకోవడం కష్ట సాధ్యమంటూ విశ్లేషకులు సైతం వెల్లడిస్తున్నారు. ఈ తరుణంలో తూర్పు నియోజకవర్గంలో ఓటర్లు అధికంగా ఉండడం, ఈ సారి పోలైన ఓట్లు సైతం మహిళలవే ఎక్కువ కావడంతో తూర్పు అభ్యర్థి గెలుపులో వారి పాత్ర కీలకమని తెలుస్తోంది.

	తూర్పులో ఓటర్ల వివరాలు	13న పోలైన ఓట్ల వివరాలు
పురుషులు	1,42,540	96,224
మహిళలు	1,49,646	1,04,324
ఇతరులు	20	15
మొత్తం	2,92,206	2,00,563

సంక్షేమ పాలనపై మొగ్గుచూపారా.!

అయితే గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనపై నియోజకర్గ ఓటర్లు ఎక్కువగా మొగ్గుచూపారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్, ఆరిలోవ, పెదజాలరిపేటతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా దోరణి కనిపించిందని వారు వెల్లడిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయా ప్రాంతాలతో పాటు నియోజకవర్గంలోని చాలా వార్డుల్లో మహిళలు సైలెంట్ ఓటింగ్‌కు ప్రాధాన్యమిచ్చినట్లు చెబుతున్నారు. దీంతో అధికార పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారనే ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి. అయితే ప్రతిపక్ష అభ్యర్థి వర్గం పెరిగిన మహిళల ఓట్లన్ని తమ సపోర్టుగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేస్తోంది. ఏది ఏమైనా ఈసారి భారీగా పెరిగిన మహిళల ఓటింగ్ శాతం ఇరువర్గాల వారి విజయంపై ప్రభావం చూపనుంది.

అడుగంటిన కొలను



కంబాలకొండలో నీరు లేకపోవడంతో ఒడ్డుకే పరిమితమైన బోట్లు



నీరు ఉన్న చోట్ల బోటింగ్ చేస్తున్న సందర్శకులు

- కంబాల కొండలో ఒడ్డుకు పరిమితమైన బోట్లు
- కొన్ని చోట్ల 4, 5 అడుగుల లోతులో అంతమాత్రంగా విహారం

ఆరిలోవ: జాతీయ రహదారి సమీప కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో నీటి కొలను ఎండిపోతోంది. దీంతో బోటింగ్ నిర్వహణ అంతంత మాత్రంగా మారింది. కంబాల కొండల మధ్యలో ఉన్న ఈ కొలను వర్షాలు కురిసినప్పుడు నిండుతుంటుంది. సుమారు 20 నుంచి 25 అడుగుల లోతులో ఉండే ఈ కొలనులో సందర్శకుల కోసం బోటింగ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కొద్ది రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కొలనులో నీరు ఆవిరైపోతోంది. దీంతో బోటింగ్ చేయడానికి వీలుపడడం లేదు. బోట్లన్నీ ఒడ్డుకే పరిమితమయ్యాయి. కొన్ని చోట్ల 4, 5 అడుగుల లోతు ఉన్న చిన్న భాగంలో కొందరు సందర్శకులు సరదాగా బోటింగ్ చేస్తున్నారు. నీటితో నిండిన కొలనులో బోటింగ్‌తో చుట్టూ రౌండ్స్ వేసే అనుభూతి మాత్రం సందర్శకులకు కలగడంలేదు. వర్షా కాలం వస్తే గానీ ఈ కొలనులో నీరు కనిపించదు.

ఏయూను సందర్శించిన అమెరికా ఆచార్యుడు



వీసీ ప్రసాదరెడ్డితో తో భేటీ అయిన అమెరికా ఆచార్యుడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీ ఇండియానా పోలీస్‌కు చెందిన డాక్టర్ మంగిలాల్ అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లతో సమావేశమయ్యారు. బోధన, పరిశోధన భాగస్వామ్యం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనే భావించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ ప్రోగ్రాం, ఆన్‌లైన్ కోర్సులను ఏయూ సిబ్‌తో పాటు ఇతర విభాగాలతో సంయుక్తంగా నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు ఆచార్య జి.గిరిజా శంకర్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాజుల అలంకరణలో చినపోలమ్మ అమ్మవారు



మద్దిలపాలెం : శివాజీపాలెంలో చినపోలమ్మ అమ్మవారు శుక్రవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వార్షికోత్సవంలో భాగంగా ఐదు రోజులుగా రోజుకొక అలంకరణలో అమ్మవారికి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఐదో రోజు గాజుల అలంకరణలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. దీంతో మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

జూలో ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు



జూలో కోతులు జోన్‌లో పాత్‌వే పక్కన జరుగుతున్న గోడల నిర్మాణం పనులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో అధికారులు పలు చోట్ల ఫుట్‌పాత్‌లకు మరమ్మతు పనులు చేపట్టారు. జూలో వన్యప్రాణులు చూడడానికే వెళ్లే సందర్శకుల సౌకర్యార్థం ఎన్‌క్లోజర్ల ముందు గతంలో పాత్‌వేలు నిర్మించిన విషయం తెలిసిందే. ఆ పాత్‌వేలు కొన్నిచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించడంతో పాటు సందర్శకుల సౌలభ్యం కోసం పాత్‌వేలకు ఇరుపక్కలా అడుగు ఎత్తులో గోడలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఏనుగులు ఎన్‌క్లోజర్ ఎదురుగా కోతులు జోన్‌లో పాత్‌వేల మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

గోపాలపట్నం: మద్యం మత్తులో మందు సీసాతో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మాధవధార గాంధీనగర్ మహతి కాలనీలో చిన్ని సంతోష్‌కుమార్, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. అక్కడే ఉంటున్న స్నేహితుడు వాసుతో కలిసి శుక్రవారం స్థానిక బార్‌కు వెళ్లి మద్యం తాగి తిరిగి కాలనీలోకి వచ్చారు. అక్కడ ఓ ఆటోలో సంతోష్‌కుమార్ అన్నయ్య అతడి స్నేహితులతో కలిసి కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో వరసకు బావ అయిన మహేష్ అనే వ్యక్తి సంతోష్‌ను మాట్లాడాలని పిలిచాడు. ఆటో దిగి వెళ్తున్న క్రమంలో మద్యం మత్తులో ఉన్న మహేష్ తనతో తెచ్చిన మందు సీసాతో సంతోష్‌పై దాడికి పాల్పడ్డాడు. ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్నేహితులు సంతోష్‌ను కేజీహెచ్‌కు తరలించారు. మహేష్ స్థానికంగా స్క్రాప్ షాప్‌లో పనిచేస్తున్నాడు. అతడి భార్యపై అసత్య ప్రచారం చేస్తున్నాడనే అనుమానంతో సంతోష్‌ను మద్యం సీసాతో పొడిచేందుకు మహేష్ యత్నించాడు. తప్పించుకునే క్రమంలో అతడి ముఖంపై గాయమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీరానికి అనాథ మృతదేహం



బీచ్ రోడ్డు: తీరానికి ఓ గుర్తు తెలియని అనాథ మృతదేహం కొట్టుకువచ్చింది. మూడో పట్టణ పోలీసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి సమయంలో తీరంలోని రాళ్ల వద్దకు కొట్టు వచ్చిన శవాన్ని సందర్శకులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు విచారించగా యాచక వృత్తి చేసుకుంటూ జీవనం సాగించే వ్యక్తిగా తేలింది.

కంటి క్యాన్సర్‌పై 26న వైట్‌థాన్ రన్



ఎల్‌వీపీ కంటి ఆస్పత్రిలో వైట్‌థాన్ రన్ కోసం టీ షర్ట్‌లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

ఆరిలోవ: ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో రెటినోబ్లాస్టొమా కంటి క్యాన్సర్‌పై అవగాహన కోసం ఈ నెల 26న ఆర్‌కే బీచ్ వద్ద వైట్‌థాన్ రన్ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ మేరకు హనుమంతవాక వద్ద ఎల్వీపీ ఆస్పత్రిలో శుక్రవారం ముఖ్యఅతిథిగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.జె శ్రీనివాస్, ప్రముఖ బాక్సింగ్ కోచ్ సీరా జయరాం, తదితరులు టీషర్ట్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్వీపీ ఆస్పత్రి ఓక్యులర్ అంకాలజిస్ట్ డాక్టర్ సునీత మాట్లాడుతూ పిల్లల్లో కనిపించే రెటినోబ్లాస్టొమా వ్యాధిపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనికి సంబంధించిన చికిత్స సకాలంలో అందిస్తే పిల్లల కంటి చూపుతో పాటు ప్రాణాలకు రక్షణ కల్పించవచ్చన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కోసం ఆ రోజు ఉదయం 5.30 గంటలకు కాళీమాత గుడి వద్ద 3, 5, 10 కిలో మీటర్ల వైట్‌థాన్ రన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి బాలకృష్ణ రాయ్, ఎల్వీపీ వైద్యుడు వీరేంద్ర సచ్‌దేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి ఉచిత యోగా శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి ఏయూ ఉద్యోగులు, పరిశోధకులకు ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహించనున్నట్టు యోగా కేంద్రం గౌరవ సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు. భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు ఈ శిబిరంలో పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహేశ్వర్‌రెడ్డి సేవలు వెలకట్టలేనివి

ఉద్యోగ విరమణ సభలో ఈపీడీసీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి ప్రశంసలు



మహేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

బీచ్ రోడ్డు: రాష్ట్ర పవర్ డిప్లమో ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా వి.వి.మహేశ్వర్‌రెడ్డి సుదీర్ఘ కాలంగా అందించిన సేవలు వెలకట్టలేనివని ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి కొనియాడారు. శుక్రవారం సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మహేశ్వర్‌రెడ్డి ఉద్యోగ విరమణ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సీనియర్ ఇంజినీర్‌గా క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేసి రాష్ట్ర విద్యుత్ శాఖ ఖ్యాతిని పెంచారన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో మహేశ్వర్‌రెడ్డి అందించిన సేవలు జూనియర్ ఇంజినీర్లకు ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కె.సత్యప్రసాద్, పి.రామ్మోహన్ పాల్గొన్నారు.

చక్కటి జీవనశైలితో అదుపులో రక్తపోటు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెం నుంచి సత్యం జంక్షన్ మీదుగా ర్యాలీ కొనసాగి తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో నెల రోజుల వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచిత రక్తపోటు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధిక రక్తపోటుతో కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాల్సి అవసరం ఉందన్నారు. గుండె జబ్బులు, పక్షవాతం, మూత్రపిండ సమస్యలు, అకాల మరణాలకు హైపర్ టెన్షన్ ప్రథమ కారణమన్నారు. చాలా మందికి అధిక రక్తపోటు లక్షణాలు లేకపోయినా, చికిత్స చేయకుండా వదిలేస్తే అది తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, మందులు తీసుకోవడం ద్వారా రక్తపోటును నివారించవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక రక్తపోటు వల్ల ఎంతో మంది మరణిస్తున్నారని అన్నారు. ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ ప్రపంచ రక్తపోటు దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అధిక రక్తపోటు తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా కొంత వరకు మరణాలను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డెమో) బి.నాగేశ్వరరావు, డాక్టర్ జగదీష్‌ప్రసాద్, టీబీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుభాషా గ్రంథావిష్కరణ



డాక్టర్ జయలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బహు భాషా గ్రంథావిష్కరణ జరిగింది. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, హిందీ ఆచార్యులు, ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ పి.కె. జయలక్ష్మి సంపాదకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాల ప్రాముఖ్యత అనే అంశంపై రచించిన ×సమాగమ్‌₹–బహుభాషా గ్రంథాన్ని ఆవిష్కరించిన సుమారు 50 మంది అధ్యాపకులను డాక్టర్ సిస్టర్ షైజీ అభినందించారు. సాహితీ రంగంలో డాక్టర్ పి.కె. జయలక్ష్మి సేవలను రచయితలు, సిస్టర్ షైజీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రచయితలు ఎస్. దీప్తి, గౌరీనాయుడు, డి. కోటేశ్వరరావు, అనుపమ, మౌసమి, సుజాత, అనిత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

వెంకటాద్రిపై ఘనంగా ధ్వజారోహణ



పూజలందుకున్న వెంకన్నస్వామి



ధ్వజారోహణలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి:వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ధ్వజారోహణ, హోమాలు జరిపారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పుర వీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.

ఎర్నిమాంబ అమ్మవారి ప్రధాన జాతర రేపు

- నేడు తొలేళ్ల సంబరం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయ గోపురం

కంచరపాలెం : సంతానం లేని దంపతులకు సంతానలక్ష్మిగా, కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారు కీర్తి గడించారు. గత వందేళ్లుగా అమ్మవారి చల్లని చూపు కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. జ్ఞానాపురం, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా ఎర్నిమాంబ కొలువై ఉన్నారు. భక్తిశ్రద్ధలతో కొలిస్తే తమ కోరికలు నెరవేరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. శనివారం ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం. ఆదివారం వైభవంగా ప్రధాన జాతర నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి ఆలయ చరిత్ర..

ఎనభై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్న నేపథ్యంలో అప్పటి భక్తులు అమ్మవారికి చిన్నగుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలోనే ఇళ్లు ఉండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రి వేళ ఈ మార్గంలో వెళ్లేందుకు అంతా భయపడేవారు. తర్వాత ఇక్కడ ప్రజలు నివసించటం మొదలు పెట్టడంతో ఊరు అభివృద్ధి చెందింది. ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్లు విస్తరించారు. గత ఇరవై ఐదేళ్లుగా అమ్మవారిని భక్తులు విశేషంగా పూజిస్తున్నారు. ఎర్నిమాంబ అమ్మవారికి తొమ్మిది మంది అక్కచెల్లెళ్లు ఉన్నట్లు పూర్వీకులు చెబుతారు. ప్రతి ఏటా మే నెల మూడో ఆదివారం నిర్వహించే ప్రధాన పండగను అద్వితీయంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు అమ్మవారి సందర్శనార్థం వస్తుంటారు. ఆదివారం ఆలయం వద్దే వంటా వార్పు చేసుకుని అమ్మవారి చెంతనే ప్రసాదాలు స్వీకరిస్తారు. 2007లో సంఘం సభ్యులే దేవాలయాన్ని ఎండోమెంటుకు అప్పగించారు.

వేతనాల చెల్లింపుల్లో జాప్యంపై ఆందోళన



ధర్నా చేస్తున్న సిటూ నాయకులు, కార్యకర్తలు

ఉక్కునగరం: స్టీల్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ మరియు మిత్రపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం స్టీల్ ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయంలో వేతనాల కోసం ధర్నా చేశారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ కర్మాగారం కోసం కష్టపడిన ఉద్యోగులకు జీతాలు ప్రతీ నెలా 7న చెల్లించాలని చట్టం చెబుతోందని, కానీ యాజమాన్యం మూడు మాసాలుగా సకాలంలో జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఉద్యోగుల జీతాల కోసం కేవలం రూ. 90 కోట్లు చెల్లించకుండా కావాలనే యాజమాన్యం కుంటిసాకులు చెబుతోందన్నారు. దీనిపై సీఎండీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. తక్షణమే జీతాలు చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోట్టీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి, మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, డి.సురేష్ బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాలర్‌ను ఢీకొట్టిన ట్యాంకర్

- రోడ్డు పాలైన సిల్వర్ బ్రిక్స్ బ్యాగులు, రెడీమిక్స్ కాంక్రీట్

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ట్రాలర్‌ను ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో సిల్వర్ బ్రిక్స్ బ్యాగుల లోడుతో షీలానగర్ నుంచి ఆటోనగర్ వైపు ట్రాలర్ వస్తోంది. అదే సమయంలో ఆటోనగర్ నుంచి రెడీమిక్స్ కాంక్రీట్ లోడులో ట్యాంకర్ వస్తోంది. సరిగ్గా సిగ్నల్ పాయింట్ వద్ద ఆటోనగర్ లోపలికి వెళ్లడానికి ట్రాలర్ మలుపు తిరుగుతుండగా.. ట్యాంకర్ ట్రాలర్‌ను ఢీకొట్టింది. ట్రాలర్ రోడ్డు పక్కనున్న డివైడర్‌పైకి దూసుకుపోయింది. రోడ్డుపై సిల్వర్ బ్రిక్స్ బ్యాగులు చిందరవందరగా పడిపోగా, కాంక్రీట్ రోడ్డు పాలైంది. గాజువాక సీఐ కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాలకు కారణమైన రెండు భారీ వాహనాలను క్రేన్‌ల సహాయంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జరిగిన ప్రమాదంలో ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం కానీ, గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుపై పడిన సామగ్రిని తొలగించారు. సాయంత్రం వరకు గాజువాక నుంచి షీలానగర్ వైపు వచ్చే వాహనచోదకులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు.